జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 3 | మే | 2026 ◆ పేజీలు : 7


# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు



## ఎస్పీ రోహిత్ రాజ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 2, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్నవైద్యప్రవేశ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిధిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాల, లక్ష్మీదేవిపల్లిలోని రామచంద్ర డిగ్రీ కళాశాల, కలెక్టరేట్ సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలోని 1,048 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల సందర్భంగా

మిగతా 2 లో...



# పేదల సంక్షేమానికి... ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**భద్రాచలం, మే 2, ప్రజాజ్యోతి:** పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు

మిగతా 2 లో...

# గిరిజన ఉత్పత్తులకు భద్రగిరి మార్ట్ వేదికగా నిలుస్తుంది

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**భద్రాచలం, మే 2, ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణ ప్రజలకు అడవుల్లో లభించే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఆర్గానిక్ వస్తువులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్వయం సహాయక సంఘాలు, గిరిజన మహిళలు, ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలనే దూరదృష్టితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఇతర అధికారులతో కలిసి సందర్శించిన మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన అటవీ ఉత్పత్తులు, గిరిజన వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ ఉత్పత్తులను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని, ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ప్రత్యేక కృషితో ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడమే కాకుండా స్థానిక గిరిజన కుటుంబాలకు

మిగతా 2 లో...

# కాంకేర్‌లో ఐఈడి పేలుడు

- నలుగురు జవాన్లు వీరమరణం




**చర్ల, మే 02 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో శనివారం డీ-మైనింగ్ చర్యల సందర్భంగా జరిగిన అనుకోని ఐ ఈ డి పేలుడు విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో జిల్లా రిజర్వ్ గార్డ్ (డి ఆర్ జి ) కు చెందిన నలుగురు జవాన్లు వీరమరణం పొందారు. కాంకేర్ పోలీస్ సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచా తెలిపిన వివరాల ప్రకారం చిన్నబెఠియా పోలీస్ స్టేషన్ పరిధిలో కాంకేర్–నారాయణపూర్ సరిహద్దు ప్రాంతంలో డీ-మైనింగ్, ఏరియా డామినేషన్, సెర్చ్ ఆపరేషన్ కోసం బృందం వెళ్లింది. ఈ సమయంలో ఐ ఈ డి నిర్వీర్యం

మిగతా 2 లో...

- లబోదిబోమంటున్న హోటల్ వ్యాపారస్తులు
- ఒకవైపు గ్యాస్ మరోవైపు పెట్రోల్ డీజిల్ కొరత
- రవాణా సౌకర్యం లేదంటూ నిత్యవసర సరుకులు ధరలు_ కూర గాయల ధరల పెంపు
- త్వరలో ఇంధనం ధరలు కూడా పెరిగే అవకాశం
- ఇక కరువు కష్టాలు మొదలైనట్టేనా?

# అధికంగా పెరిగిన గ్యాస్ ధరలు

7 లో..



## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి...)

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## గిరిజన ఉత్పత్తులకు భద్రగిరి మార్ట్ వేదికగా నిలుస్తుంది





(మొదటి పేజీ తరువాయి...)

ఆర్థిక బలాన్ని అందించే లక్ష్యంతో దీనిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు భద్రగిరి మార్ట్ ను సద్వినియోగం చేసుకుని గిరిజనుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారికి ఆర్థికంగా అండగా నిలవాలని మంత్రి కోరారు. గిరిజనుల సంప్రదాయ ఉత్పత్తులకు సరైన గుర్తింపు తీసుకురావడం, వారి జీవనోపాధిని మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ మార్ట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అనంతరం భద్రగిరి మార్ట్ ఆవరణలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంకేర్‌లో ఐఈడి పేలుడు

(మొదటి పేజీ తరువాయి...)

చేసే క్రమంలో అది అకస్మాత్తుగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, బస్తర్ ఫైటర్ కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే ఘటనాస్థలంలోనే వీరమరణం పొందారు. మరో గాయపడిన బస్తర్ ఫైటర్ కానిస్టేబుల్ పరమానంద్ కొర్రామ్‌ను రాయపూర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందరరాజ్ పట్టిలింగం వెల్లడించిన వివరాల మేరకు ఇటీవల లొంగిపోయిన మావోయిస్టుల సమాచారం ఆధారంగా వందలాది ఐ ఈ డి లను భద్రతా దళాలు స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశాయి అని అయితే శనివారం జరిగిన ఈ ఘటనలో ఐ ఈ డి లను నిర్వీర్యం చేసే సమయంలో పేలుడు సంభవించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ ఘటనపై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది





(మొదటి పేజీ తరువాయి...)

ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ , కంప్యూటర్ ల్యాబ్ లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్ తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడు తూ ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్ పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ఇల్లందు, మే 2, ప్రజాజ్యోతి:** మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో అగ్నిప్రమాదంలో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అగ్నిప్రమాదంలో తీవ్ర నష్టం వాటిల్లిన్న పంటలను బిఆర్ఎస్ నాయకులు, మాజీ పిఏసిఎస్ వైస్ చైర్మెన్ బండారి శ్రీనివాస్, చల్లసముద్రం సర్పంచ్ ఏపే శంకర్, ఉప సర్పంచ్ గుగ్గిళ్ల నరేష్, చల్లసముద్రం మాజీ యంపిటిసి పూనెం లింగమ్మ లు పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చే సమయానికి అగ్నిప్రమాదంలో దగ్ధం అవడం ఆ రైతులను తీవ్ర కష్టాలపాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడ్డుగూడెం పంచాయతీలో అగ్నిప్రమాదంలో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకొని ఆ రైతు కుటుంబానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన నాయకులు భూక్య సురేష్, అయిలు నారాయణ గౌడ్, సోలం జనార్ధన్, బానోత్ బనిషా, గుగ్గిళ్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరణ



**ఇల్లందు, మే 2, ప్రజాజ్యోతి:** ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గా కాటం స్వరూప శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ బి. రవికుమార్ వద్ద నుండి బాధ్యతలు స్వీకరించారు. నూతన జడ్జి కి ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్యా రవికుమార్ నాయక్, కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ పరస్పరం సహకారంతో కక్షిదారులకు న్యాయ సేవలు అందించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్యా రవికుమార్ నాయక్, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కోసం రూ. కోట్లు ఖర్చు
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు
- గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సిసి, బిటి రోడ్లు : ఎమ్మెల్యే





**ఇల్లందు, మే 2, ప్రజాజ్యోతి:** పేద ప్రజల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శనివారం మండలం మండలంలోని బొజ్జాయి గూడెం గ్రామంలో గల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఇల్లందు నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కోసం రూ. కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సిసి, బిటి రోడ్లు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచెసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మన నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న సంక్షేమ పథకాల కోసం వందల రూ. కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పేదలందరికి సన్నబియ్యం, ఉచిత విధ్యుత్, మహిళలందరికి ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డి లేని బుణాలు, రేషన్ కార్డులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పంపిణి చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ళు పేరిట ప్రజా ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనన్న నేతృత్వంలో వారి సోంత ఇంటి కల నిరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో విధ్య,వైద్యానికి పెద్దపీట వేస్తూ ఇల్లందులో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రెటేడ్ స్కూల్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధ పడే వారికి సిఎం రీలిఫ్ ఫండ్, పెదింటి ఆడబిడ్డ పెళ్ళికి కళ్యాణ లక్షి , షాదిముబారక్ చెక్కులు పంపిణి చేస్తున్నామని గుర్తు చేశారు. అంగన్ వాడీ వ్యవస్థ పారదర్శకంగా ఉండాలని మంత్రి సీతక్క నేతృత్వంలో స్మార్ట్ ఫోన్లు పంపిణి చేస్తున్నామని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గం 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, రైతులందరూ సేంద్రియా వ్యవసాయంపై దృష్టి సారించాలని, అయిల్ పామ్ వ్యవసాయంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పేద ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రజా ప్రతినిధులు ప్రతి గడపకు చేరవేయాలని, చేస్తున్న మేలు తెలియపర్చాలని కోరారు. అనంతరం వ్యవసాయ సంబంధిత, డ్రగ్స్ నిర్మూలన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అదే విదంగా అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లు, 41 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 3.26 కోట్ల చెక్కులను అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అదేవిదంగా నియోజకవర్గంలో అమరవుతున్న ఉచిత సంక్షేమ పథకాలు, వాటి వ్యయాలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ విధ్యా చందన, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, ఆత్మ కమిటి చైర్మన్ మంగిలాల్ నాయక్, 5 మండలాల తహసీల్దార్ లు, యంపిడిఓలు, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, భవన నిర్మాణ, విధ్యాశాఖ అధికారులు, మిగిలిన శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక్రమం పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామివారికి లక్ష రూపాయల బంగారు ప్రతిమల సమర్పణ

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సమక్షంలో పర్సా వెంకట్ బంగారు ప్రతిమల అందజేత





**అన్నపురెడ్డిపల్లి, మే 2, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకుడు పర్సా వెంకట్ స్వామివారికి లక్ష రూపాయల విలువగల బంగారు ప్రతిమలను భక్తి పూర్వకంగా సమర్పించాడు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సమక్షంలో దేవాలయ అధికారులకు ఈ ప్రతిమలను అందజేశారు. పర్సా వెంకట్ మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలు సుఖశాంతులతో ఉండాల ని ఆకాంక్షించాడు. దేవాలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తె లిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి భావంతో నిర్వహించబడింది.

## నేడు జరిగే నీట్ పరీక్ష అభ్యర్థులకు తల్లిదండ్రులకు జిల్లా కాల్ సెంటర్ నెంబర్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 2,(ప్రజా జ్యోతి)** నేడు జరిగే నీట్ పరీక్ష అభ్యర్థులకు తల్లిదండ్రులకు జిల్లా కాల్ సెంటర్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు, అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు, నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలు ఉన్న 93929 19743 ఈ నెంబర్ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు .ఈ కాల్ సెంటర్ ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

## సర్పంచుల మండల కమిటీని బహిష్కరించిన సిపిఐ పార్టీ సర్పంచులు

- సి పి ఐ పార్టీ సర్పంచ్ లకు ఎటువంటి సంబంధం లేదు



**సుజాతనగర్ ప్రజాజ్యోతి మే 02:** మండలంలోని అధికారులకు ప్రజా ప్రతినిధులకు ప్రజలకు తెలియజేయునది ఏమనగా నిన్న జరిగినటువంటి సుజాతనగర్ మండల సర్పంచ్ల సంఘం ఎన్నికకు సుజాతనగర్ సి పి ఐ పార్టీ సర్పంచ్ లకు ఎటువంటి సంబంధం లేదని పత్రిక ముఖంగా తెలియజేస్తున్నాం నిన్న జరిగినటువంటి ఏదైతే ఉందో ఆ కమిటీ కాంగ్రెస్ పార్టీ మండల సర్పంచ్ల కమిటీగా భావిస్తున్నాము ఈ సందర్భంగా సి పి ఐ సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్ మాట్లాడుతూ సుజాతనగర్ మండల సర్పంచ్ కమిటీలో సి పి ఐ పార్టీకి చెందిన సర్పంచులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మండలం ముఖ్య నాయకుడు కను సైగల్లో పొంగిలేటి క్యాంపు కార్యాలయం కొత్తగూడెంలో సుజాతనగర్ సర్పంచుల మండల కమిటీని వేసుకొని సుజాతనగర్ మండలంలోని 13 మంది సర్పంచులు ఆమోదం తోటి ఏర్పడినట్టు సామాజక మద్యమాలో ప్రకటనలు విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము ఇప్పటినుండి సుజాతనగర్ సర్పంచుల మండల కమిటీ పేరుతో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించిన దానికి పూర్తి విరుద్ధంగా సిపిఐ పార్టీ సర్పంచులంతా ఏకమవుతారని తెలుపుతున్నాము.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- ట్రాక్టర్లపై కట్టుదిట్టమైన నిఘా
- ఎస్సై విజయ్ సింహా రెడ్డి హెచ్చరిక




**అన్నపురెడ్డిపల్లి, మే 2, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం వెలువడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వై. విజయ్ సింహా రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం లేదా రవాణా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఇసుక రవాణా చేయదలచిన వారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతి పొందాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు సహా ఏ ప్రభుత్వ నిర్మాణ పనులకైనా అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలించడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సహకరించే వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై తెలిపారు.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పైనుంచి భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ కు గిరిజన యువకుడి సందేశం

- పీవో రాహుల్ పనితీరుపై ప్రశంసలు







**భద్రాచలం టౌన్ , మే 2 , ప్రజాజ్యోతి** పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామానికి చెందిన బి. మోతీ కుమార్ అనే గిరిజన యువకుడు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ పై తనకున్న అభిమానంను చాటుకున్నాడు. ప్రస్తుతం మోతీకుమార్ ఎవరెస్ట్ శిఖరంను అధిరోహిస్తూ సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్ కు వరకు వెళ్లాడు. త్వరలో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించబోతున్నాడు. ఈ క్రమంలో బేస్క్యాంపు వద్ద నుంచి భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ గిరిజనులకు చేస్తున్న సేవలను అభినందిస్తూ వీడియో సందేశం విడుదల చేశారు. సార్ గిరిజనుల సంక్షేమం కోసం మీరు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా, మీపై ఉన్న అభిమానంతో ఈ ఫ్లెక్సీని తీసుకొచ్చాను, గిరిజన సంస్కృతిని భద్రపరిచేందుకు అత్యాధునిక గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయటం, గిరిజన ఉత్పత్తుల కోసం భద్రగిరి మార్ట్ సృష్టించి, వారిని వ్యాపారులుగా మార్చడం, విద్య, వైద్యం, సాగు మరియు తాగునీటి సౌకర్యాల కల్పనలో విప్లవాత్మక మార్పులు చేశారు.ఆదివాసీ జేఏసీ ద్వారా ఆదివాసి వికాస రత్న బిరుదు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం మోతీకుమార్ గతంలో మౌంట్ కిలి మంజారో పర్వతం 5 8 9 5 మీటర్లు, మౌంట్ ఎల్బ్రస్ పర్వతం 5642 మీటర్లు అధిరోహించి రావడం జరిగిందని, దీనికి అతను, దాతల సహకారం కోరుతున్నాడు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కూనంనేని





**కొత్తగూడెం, మే 2 ( ప్రజాజ్యోతి )** పేదల ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగు లు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం కమ్మసత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ పథకాల కింద 86 మందికి రూ.86.09 లక్షల చెక్కులు అందజేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడతారని పేర్కొంటూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ.5.25 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి కీలకంగా ఉపయోగపడుతోందని నియోజకవర్గంలోని 72 మందికి రూ.35 లక్షల వైద్య సహాయం అందించినట్లు తెలిపారు. ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరేలా కృషి చేస్తామని పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు, కమిషనర్ సుజాత, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల అధికారులు పుల్లయ్య, సుభాషిణి, నాగరాజు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



**కొత్తగూడెం, మే 2 ( ప్రజాజ్యోతి )** చంద్రుగొండ మండలంలో పిడుగుపాటు విషాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గానుగపాడు గ్రామానికి చెందిన కొండ్రు వినోద్ (ఫీల్డ్ అసిస్టెంట్, ప్రైవేట్ ఉద్యోగి) పిడుగు పడటంతో మృతి చెందారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో వర్షం మొదలవుతుండడంతో వినోద్ సహా నలుగురు ఒకే ప్రాంతంలో చెట్టు పక్కన నిలబడ్డారు. ఈ సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వినోద్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ చౌర్యం నేరం

- గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం

**పినపాక,మే 02(ప్రజాజ్యోతి)**పినపాక మండలం వెంకటరావుపేట గ్రామంలో విద్యుత్ ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు.విద్యుత్ చౌర్యం చట్ట విరుద్ధమని, ఇది ప్రమాదాలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. అక్రమ కనెక్షన్లు, నాసిరకం వైర్లు ఉపయోగించడం వల్ల అగ్ని ప్రమాదాలు, ప్రాణాపాయాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు



# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



**టేకులపల్లి, మే02, ప్రజాజ్యోతి:** ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులు అనుసరించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారి రైతులు ఆర్థికంగా ఎదుగుతారని కృషి విజ్ఞన కేంద్రం శాస్త్రవేత్త డా.టి. భరత్ అన్నారు.శనివారం టేకులపల్లి మండలం బోడు గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయాధికారులు నిర్వహించిన రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్నికి కృషి విజ్ఞన కేంద్ర శాస్త్రవేత్తలు డా. టి. భరత్ పాల్గొన్నిమాట్లాడుతు రైతులు సాగు ఖర్చులను తగ్గించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంటలు సాగు చేసే సమయంలో రసాయనాల వాడకం విచ్చలవిడిగా వేసి భూసారాన్ని నష్టం చేసుకోకూడదన్నారు. శాస్త్రవేత్త డా. హేమ శరత్ చంద్ర మాట్లాడుతురైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని ఆయన సూ చించారు. రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవా లని ఆయన తెలియపరిచారు. ఉద్యాన శాస్త్రవేత్త బి శివ మాట్లాడుతూ మార్కెట్లో గిరాకీ ఉన్న పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేల, నీరు, పర్యా వరణం అందించడం రైతుల బాధ్యత అని అన్నారు. రైతులకు అవగాహన కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ చేయబోతున్నారని వివరించడం జరిగినది. రైతులు ఒకే రకమైన పంటలను పండిస్తున్నారు. అందువలన ఇది రైతులకు కూడా గిట్టుబాటు కావడం లేదు.కనుక రైతులు పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందటం తో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయం క్షేత్రంలో పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ముఖ్యంగాపందిరిలో కూరగాయల సాగు,ఆయిల్ పామ్ పంట,నీళ్ల సౌకర్యం లేని చోట కుంకుడు పంటను పండించడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూమండలంలోని రైతులు అందరు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఈ సందర్భంగా రైతులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరన అధికారి రమేష్, 60 మంది రైతులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన మొక్కజొన్న

- విద్యుత్తు హై టెన్షన్ వైర్ల రాపిడితో చెలరేగిన మంటలు
- 13 ఎకరాల్లో వ్యాపించిన మంటలు
- లబోదిబోమంటున్న రైతులు





**ఇల్లెందు, మే 2, ప్రజాజ్యోతి:** అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంటఇల్లందు మండలం పోలారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. 8 మంది రైతులకు చెందిన 13 ఎకరాల్లో పంట నష్టంతో రైతులకు పెద్ద దెబ్బ తగిలింది. విద్యుత్ హై టెన్షన్ వైర్ల రాపిడితో చెలరేగిన మంటలు మొక్కజొన్న పంటను అగ్నికి ఆహుతి చేశాయి. ఒక్కసారిగా చెలరేగిన ఈ అగ్ని ప్రమాదం క్షణాల్లో విస్తరించి సుమారు 13 ఎకరాల మేర పంటను కాల్చివేసింది.

**విద్యుత్ వైర్ల రాపిడితో మంటలు చెలరేగిన ఘటన ...**స్థానికుల సమాచారం ప్రకారం గాలుల వేగం కారణంగా హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఒకదానితో ఒకటి రాపిడికి లోనై స్పార్కులు వచ్చాయి. ఆ స్పార్కులు పొలాల్లో ఉన్న ఎండిన మొక్కజొన్నకు తగలడంతో మంటలు చెలరేగాయి. వేగంగా వ్యాపించిన మంటలను అదుపులోకి తేవడానికి గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే విస్తారమైన నష్టం సంభవించింది.

**13 ఎకరాల్లో పంట నష్టం – రైతుల కష్టాలు వృథా ...** ఈ ఘటనలో సుమారు 13 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి పంటను కోత దశకు తీసుకువచ్చిన రైతులు ఒక్కసారిగా నష్టపోయారు. నెలల తరబడి చేసిన శ్రమ క్షణాల్లో బూడిద కావడంతో రైతులు లబోదిబో అంటున్నారు.

**సహాయం కోసం రైతుల ఆర్తనాదం ...**పంట నష్టం తీవ్రంగా ఉండడంతో బాధిత రైతులు ప్రభుత్వాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. తక్షణమే నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు...** ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, నష్టాన్ని అంచనా వేసే చర్యలు చేపట్టాలని స్థానికులు ఆశిస్తున్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకోని తక్షణ సహాయం అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలు మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నివారించాలి

- భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్



**భద్రాచలం టౌన్, మే 2 , ప్రజాజ్యోతి,** ప్రజలు మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ అన్నారు. భద్రాచలంలో శనివారం మండల్ లీగల్ సర్వీసెస్ సంస్థ భద్రాచలం వారి ఆధ్వర్యంలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అనుసంధానంతో నషాముక్త కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి శివనాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదక ద్రవాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక మరియు ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు.అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దుర్గా భవాని, భద్రాచలం సీఐ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హోంగార్డ్ సురేష్‌కు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నివాళి



**కొత్తగూడెం, మే 2 ( ప్రజాజ్యోతి )** గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డ్ సురేష్ భౌతిక కాయానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నివాళులర్పించారు. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌కు శనివారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత ఆసుపత్రిలో ఉంచిన సురేష్ భౌతిక కాయాన్ని సందర్శించిన ఎస్పీ నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎల్లప్పుడూ చురుకుగా విధులు నిర్వర్తించే సురేష్ అకస్మాత్తుగా మరణించడం బాధాకరమని తెలిపారు. కుటుంబానికి అండగా ఉండాలని తదుపరి కార్యక్రమాలను సమన్వయం చేయాలని అధికారులకు ఆదేశించారు.

# డీజే మోతలతో దద్దరిల్లుతున్న పాల్వంచ

- శబ్ద కాలుష్యంతో ప్రజలలో ప్రాణ భయం
- రాత్రివేళల్లో ఇష్టారాజ్యంగా డీజేలు, పట్టించుకోని యంత్రాంగం



**పాల్వంచ, మే 02, ప్రజాజ్యోతి:** పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో పట్టణం, పరిసర ప్రాంతాల్లో డీజే మోతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వేడుకల పేరుతో అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనుమతులు ఉన్నా లేకున్నా, నిబంధనలకు విరుద్ధంగా భారీ సౌండ్ బాక్స్‌లతో రాత్రింబవళ్లు శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండగా, ప్రజల ప్రశాంత జీవనం దెబ్బతింటోందని పలువురు ఆలోపిస్తున్నారు.

### ››› పెళ్లిళ్ల సీజన్‌తో పెరిగిన డీజే సంస్కృతి

ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో పట్టణంలోని ప్రతి వీధిలోనూ డీజే వాహనాలు దర్శనమిస్తున్నాయి. పెళ్లి ఊరేగింపులు, శోభాయాత్రలు, బర్త్‌డే వేడుకలు, ఇతర శుభకార్యాల పేరుతో పెద్ద ఎత్తున డీజేలను వినియోగిస్తున్నారు. ఆనందాన్ని పంచుకోవాల్సిన వేడుకలు, అసౌకర్యానికి కారణమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ››› అధిక డెసిబుల్‌తో శబ్ద కాలుష్యం

చట్టపరంగా నిర్ణయించిన డెసిబుల్ పరిమితులను పూర్తిగా పక్కనపెట్టి చెవులు పగిలేలా శబ్దాలను ప్రసారం చేస్తున్నారు. గల్లీల్లో, కాలనీల్లో ఈ భారీ శబ్దాలు ప్రతిధ్వనిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ శబ్దాల కారణంగా నిద్రలేమి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› రోడ్ షోలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

డీజే వాహనాలతో నిర్వహించే రోడ్ షోలు పాల్వంచ ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలకు వెళ్లే అంబులెన్సులు, ఇతర వాహనాలు కూడా నిలిచిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

### ››› మద్యం మత్తులో వెకిలి డ్యాన్సులు

డీజే కార్యక్రమాల సమయంలో కొందరు యువకులు మద్యం సేవించి రోడ్లపై అసభ్యకరంగా నృత్యాలు చేయడం సర్వసాధారణమైంది. దీంతో మహిళలు, కుటుంబ సభ్యులు అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో గొడవలు, ఘర్షణలకు కూడా ఇది దారితీస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› గల్లీల్లో డీజే మోతలతో ప్రాణాలకు ముప్పు

ఇరుకైన గల్లీల్లో భారీ సౌండ్ సిస్టమ్‌లతో తిరుగుతూ కార్యక్రమాలు నిర్వహించడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ››› వృద్ధులు, చిన్నపిల్లల్లో భయాందోళనలు

భారీ శబ్దాలు వృద్ధులకు, చిన్నపిల్లలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. చిన్నారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఏడవడం, వృద్ధులు మానసిక ఒత్తిడికి గురవడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› హార్ట్ పేషెంట్లకు పెరుగుతున్న ప్రమాదం

అధిక శబ్దాలు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఒక్కసారిగా భారీ శబ్దాలు వినిపించడం వల్ల గుండె వేగం పెరిగి ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### ››› మూగజీవాల పరుగులు – ప్రమాదాల ముప్పు

డీజే శబ్దాలకు భయపడి కుక్కలు, పశువులు, ఇతర మూగజీవాలు పరుగులు తీయడం వల్ల రోడ్లపై ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్నిసార్లు వాహనాలకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని అలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ››› అనుమతి నిల్లు, సౌండ్ ఫుల్లు

అధికారుల నుంచి సాధారణ అనుమతి తీసుకున్నా, ఆ అనుమతుల పరిమితులను పట్టించుకోకుండా పూర్తి శబ్దంతో డీజేలను మోగిస్తున్నారు. అనుమతి ఒకటైతే, వినియోగం మరోలా ఉండటంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ››› పోలీసుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

డీజే నిర్వాహకుల నుంచి కొందరు పోలీసులు మామూళ్లు తీసుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### ››› రాత్రి 10 తర్వాత కూడా ఇష్టారాజ్యం

నిబంధనల ప్రకారం రాత్రి 10గంటల తర్వాత భారీ శబ్దాలతో కార్యక్రమాలు నిర్వహించకూడదు. కానీ చాలా చోట్ల అర్ధరాత్రి దాటినా డీజేలు మోగుతూనే ఉన్నాయి. పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ››› బాణసంచాతో మరింత భయాందోళనలు

డీజే కార్యక్రమాల సమయంలో బాణసంచా పేల్చడం మరింత ప్రమాదకరంగా మారుతోంది. అగ్ని ప్రమాదాలు, గాయాల ప్రమాదం ఉన్నప్పటికీ నియంత్రణ లేకుండా బాణసంచా కాలుస్తున్నారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

### ››› కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

డీజే మోతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, పోలీసు శాఖ వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, శబ్ద కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర గ్రామాభివృద్ధికి కీలకం

- ఎమ్మెల్యేను కలిసిన మహిళా సర్పంచులు



**పినపాక,మే 02(ప్రజాజ్యోతి):** మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర గ్రామాభివృద్ధిలో కీలకమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును పినపాక మండలానికి చెందిన మహిళా సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, తాగునీటి సమస్యలు, రోడ్లు మరియు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. మహిళా సర్పంచుల సమస్యలను ఎమ్మెల్యే శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, పినపాక సర్పంచ్ అలివేలు, సీతారాంపురం సర్పంచ్ అనిత, జగ్గారం సర్పంచ్ సుహాసిని, పాత రెడ్డిపాలెం సర్పంచ్ నాగ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల వేతనాల పెంపు

- ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ వెల్లడి




**టేకులపల్లి,మే02,ప్రజాజ్యోతి:** మండలంలో భవన నిర్మాణ కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్ తెలిపారు. టేకులపల్లి భవన నిర్మాణ కార్మికుల సమావేశం శనివారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో మెండు వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఈ ప్రసాద్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో పెరిగిన నిత్యవసర సామాన్ల రేట్ల అనుగుణంగా భవన నిర్మాణ కార్మికుల జీతభత్యాలు పెంచుటకు టేకులపల్లి మండల భవన నిర్మాణ కార్మికుల సమక్షంలో పెంచినట్లు రాష్ట్ర నాయకులు బి ప్రసాద్ వెల్లడించారు.ఆయన పెరిగి వివరాలు వెల్లడిస్తూ.. తాపీ మేస్త్రి వేతనం రూ.1000 నుంచి రూ.1100కు, పురుష కూలీలకు రూ.700 నుంచి రూ.800కు, మహిళా కూలీలకు రూ. 700లుగా ఖరారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నూతన రేట్లు మే 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. యూనియన్ నిబంధన ఉలగించిన మేస్త్రీలు గాని, కార్మికులు గాని యూనియన్ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకన్న,డేగటి క్రాంతి కుమార్, వంశీ, శ్రీను, శోభన్, కానుగుల వెంకన్న, నామకార్తీక్, పెనక సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి



**బూర్గంపహాడ్, మే 2 (ప్రజా జ్యోతి):** కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జింకలగూడెం సమీపంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన ధరావత్ కిషన్ (53) శనివారం ఉదయం జింకలగూడెం వైపు నడుచుకుంటూ వెళుతుండగా పాల్వంచ నుంచి వస్తున్న కారు జింకలగూడెం సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కిషన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుమారుడు చంటి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగభిక్షం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 12వ వేజ్ బోర్డు జెబిసిసిఐ -12 ఏర్పాటు కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలి

**ఇల్లందు, మే 2, ప్రజాజ్యోతి:** 12వ వేజ్ బోర్డు జెబిసిసిఐ –12 ఏర్పాటు కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్,ఇల్లందు ఏరియా సెక్రటరీ పి లీలాకృష్ణ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ దేశవ్యాప్తంగా పనిచేస్తున్న బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పంద కాలపరిమితి 30 జులై 2026 తో ముగుస్తుందని, అయినప్పటికీ ఇప్పటివరకు కోల్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం ఏమిటన్నారు. కమిటీ నిర్మాణానికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కార్మికులలో తీవ్ర అసంతృప్తి బొగ్గు గనులపై ఏర్పడుతుందని, కీలకమైన కమిటీ ఏర్పాటు నోటిఫికేషన్ విడుదల విషయంలో నిర్లక్ష్యంగా నియంతృత్వంగా వ్యవహరించడం మంచిది కాదని తెలిపారు. అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ 113వ వర్కింగ్ కమిటీ సమావేశం గత నెల 9, 10 తేదీలలో ఒడిశా రాష్ట్రంలోని తాల్చేర్అంగుల్ ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో దేశంలో



ఉన్న బొగ్గు పరిశ్రమలలో యాజమాన్యాలు కార్మికుల సమస్యల పట్ల నియంతృత్వ, నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని కోల్ ఇండియా సింగరేణి పరిశ్రమలో తీవ్ర ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు. అదేవిదంగా 11వ వేజ్ బోర్డు జెబీసీసీఐ ఒప్పందంలో కార్మికులకు ఏ 1 గ్రేడ్ లలో వేతనం అధికారుల కంటే ఎక్కువగా ఉందనే కారణంతో వేతన సవరణను అడ్డుకునేందుకు హైకోర్టులో కేసులు వేశారని ప్రయత్నం విఫలమైన తర్వాత డిపోర్టు మెంటల్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ డిపిఈ (డిపిఈ) నిబంధనలను సాకుగా చూపిస్తూ ఇతర పబ్లిక్ సెక్టార్ సంస్థలతో అధికారుల జీతాలను పోల్చి, హైకోర్టు ద్వారా ఆర్డర్ పొందినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను కోల్ ఇండియా యాజమాన్యం పూర్తిగా అధ్యయనం చేయకుండా 2017 నుండి అధికారుల వేతన సవరణను అమలు చేసిన కాలం నుండి పరిగణలోకి తీసుకోవడం వల్ల సుమారు రూ. 3500 కోట్ల అదనపు భారం కోల్ ఇండియాపై పడుతుందని గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమ పథకాలు,సెలవులు (ప్లే డే), పబ్లిక్ హాలిడేలు తదితర అంశాలపై కోతలు విధించడం సరికాదన్నారు.కార్మికుల వేతన సవరణ సమయంలో కంపెనీ ఆర్థిక పరిస్థితులపై విస్తృతమైన ప్రజెంటేషన్లు ఇస్తున్న యాజమాన్యం, అధికారుల వేతన సవరణ విషయంలో మాత్రం ఏకపక్షంగా ఉదారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

## గాలిదుమారానికి రేకులు లేచిపోయిన ఇళ్లు

- పిడుగుపాటుకు వ్యక్తి మృతి




**బూర్గంపహాడ్, మే 2 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాక భాస్కర్ నగర్ ఎస్టీ కాలనీలో రెండు రేకుల ఇళ్లు శనివారం గాలిధుమారంతో కూడిన వర్షానికి కూలిపోయాయి.భాస్కరనగర్ ఎస్టీ కాలనీలో పెట్టి మధు, హాయ్లాల రత్నం ఇంటి పైకప్పుతో ఉన్న రేకులు ఎగిరిపోవడంతో పాటు ఒక ఇల్లు రేకులతో సహా కూలిపోయింది. అకాల గాలిధుమారంతో కురిసిన వర్షంతో ఈ నష్టం జరగడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు.

**పిడుగుపాటుకు వ్యక్తి మృతి...** అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో మాజీ వార్డు మెంబరు సోడె గోపయ్య (50) తన పొలంలో నువ్వులు వర్షానికి తడవకుండా ఆరబోస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగుపడింది. దీంతో గో పయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. కుటుంబసభ్యులు గోపయ్య మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. అదేవిధంగా గ్రామంలో మరో పిడుగు కొబ్బరిచెట్టుపై పిడుగుపడి కాలిపోయింది.

## పాల్వంచ 5వ డివిజన్‌లో అభివృద్ధికి మరో ముందడుగు



**పాల్వంచ, మే 02, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత సారథ్యంలో కాంట్రాక్టర్స్ కాలనీలో సీసీ రోడ్ నిర్మాణానికి ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి ముఖ్య అతిథులుగా హాజరై, 5వ డివిజన్ కార్పొరేటర్ నూకల సరితతో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్స్ కాలనీలో సీసీ రోడ్ నిర్మాణంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు కాలనీ రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.స్థానికులు ఈ అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలను పరిష్కరిస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్ నూకల సరితకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కాలనీ వాసులు , పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో భారీ జాబ్ మేళా

- యువతకు సువర్ణావకాశం
- 80 కంపెనీలు, 3200 పైచిలుకు ఉద్యోగాలు



**దమ్మపేట,మే2,(ప్రజాజ్యోతి ):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎన్నికల హామీల అమలులో భాగంగా ఈ నెల 4న ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు.ఈ జాబ్ మేళాలో సుమారు 80 కంపెనీలు పాల్గొని 3200 పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు దమ్మపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాక రమేష్ తెలిపారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పరిధిలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాల్గొనదలచిన అభ్యర్థులు ముందుగా http://satg.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హతలు కలిగిన యువతంతా జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

# ఆయిల్ ఫామ్ రైతులకు ఊరటనిచ్చిన ధర నిర్ణయం

- మంత్రి తుమ్మలకు అభినందనలు
- హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలతో భేటీ అయిన ఆలపాటి ప్రసాద్



**దమ్మపేట,మే.02,(ప్రజాజ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ను తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ గెలల ధరను ఓఈఆర్ 20.01 శాతం ఆధారంగా టన్నుకు రూ.23,501గా నిర్ణయించడం పట్ల మంత్రి తుమ్మలకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ధర నిర్ణయం ఆయిల్ ఫామ్ సాగు రైతులకు గణనీయమైన ఊరటనిచ్చిందని ఆలపాటి పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న ఓఈఆర్ విధానం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా గెలల ధర పెరగడం అక్కడి రైతులకు లాభదాయకంగా మారిందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఓఈఆర్ 18 శాతం ఉండగా, తెలంగాణలో 20.01 శాతం ఉండటం రైతుల ఆదాయంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు పలు ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ నెల గెలల టన్ను ధర రూ.23,501గా నిర్ణయించబడటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆయిల్ ఫామ్ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## మహా కుంభాభిషేక ఆహ్వాన వాల్ పోస్టర్ విడుదల

- మహేష్ కుమార్ గౌడ్‌కు ఆహ్వాన పత్రం అందజేత



**అన్నపురెడ్డిపల్లి, మే 2, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన వాల్ పోస్టర్‌ను ఇటీవల ఆవిష్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు.శనివారం హైదరాబాద్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మారగాని శ్రీనివాసరావు, మహోత్సవానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తానని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మహా కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గండుగులపల్లిలో తిరునాళ్ల మహోత్సవం

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు



**దమ్మపేట,మే.02,(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో శ్రీ నాగెళ్ల ముత్యాలమ్మ, శ్రీ కనకదుర్గా అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు కమిటీ ఆహ్వానం మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మెచ్చా నాగేశ్వరరావు అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజల శ్రేయస్సు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో తుమ్మల శేషుబాబు, తుమ్మల లక్ష్మణ్ రావు, మండవ సత్య, అప్పాని రమేష్, ధనేకుల కృష్ణారావు, కుకలకుంట వెంకటేశ్వర్లు, గాంధీ, కూచిపూడి చందర్ రావు, కుసంపూడి నరేష్, తుమ్మల శంకర్ రావు, ఎర్ర వసంతరావు, నరకుల్ల కృష్ణారావు, తుమ్మల ఉమా, కుంట ఏడుకొండలు, ఎలమంచి రమణారావు, పుల్లారావు, ముడుపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రణాళికపై దిశానిర్దేశం

- 99 రోజుల కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలి: ఎమ్మెల్యే జారే




**దమ్మపేట,మే.02,(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలంలోని శ్రీ చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని మార్గనిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అధికారులు అంకితభావంతో అమలు చేసి విజయవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.ఈ ప్రణాళికలో పారిశుధ్యం, ఆరోగ్యం, 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత–క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార–ప్రతిపక్ష భేదం లేకుండా అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేస్తే, ప్రాధాన్యత మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు.ఈ సమావేశంలో సర్పంచులు, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిగిరి మెత్తి... మెడపై కత్తి...!

- యథేచ్ఛగా గిరిగిరి దందా! -రూ.10వేలకు ముందుగా రూ.1000 కట్
- రోజుకు రూ.100 నుంచి రూ.200 వసూలు
- ఇల్లందులో రూ.కోట్లలో గిరిగిరి నిర్వహణ -మితిమీరుతున్న ఆగడాలు -తిరిగి చెల్లించకుంటే మానసిక ఇబ్బందులే?
- -జలగల్లా పట్టి పిడిస్తున్న వైనం
- అనుమతులు లేకుండానే గిరిగిరి దందా నిర్వహణ
- పేదల కష్టాల రక్తాన్ని పీల్చుతున్న గిరిగిరి నిర్వాహకులు
- గిరిగిరి దందాకు చెక్ పెట్టడం సాధ్యామేనా..?



**ఇల్లందు, మే 2, ప్రజాజ్యోతి:** గిరిగిరి ఫైనాన్స్ దందా.. ఈ పేరు వింటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు అధిక వడ్డీకి అప్పు ఇస్తూ.. మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సమాచారం. జిల్లాతో పాటు ప్రధానంగా ఇల్లందులో గిరిగిరి ఫైనాన్స్ మాఫియాగా మారిందనే చెప్పొచ్చు. పేద, మధ్యతరగతి కుటుంబాలను పీల్చి పిప్పి చేస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. గిరిగిరి దందాకు అనుమతులు అటుంచితే.. అదుపులేని వడ్డీతో అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని తెలుస్తుంది. వీరి బారిన పడుతున్న పేదలు ఇళ్లు, భూములు గుల్ల చేసుకుంటున్నారని సమాచారం. అక్రమ వ్యాపారాన్ని నియంత్రించాల్సిన అధికారులు వ్యాపారుల దందాకు చెక్ పెట్టకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా గిరిగిరి పేరుతో రూ.10 వేలు ఇస్తే ముందుగానే రూ.1000 కట్ చేసుకొని రూ.9వేలు సదరు వ్యక్తికి ఇవ్వడం జరుగుతుంది. ప్రతి రోజు రోజుకు రూ.100 నుంచి రూ. 200 ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఇల్లందులో ఏకంగా కొందరు వ్యక్తులు రూ. కోట్లల్లో గిరిగిరి ఫైనాన్స్ దందా కొనసాగిస్తూ వారం రోజులకు ఒకసారి ఇంటింటికి తిరిగి మరి డబ్బులు వసూలు చేయడం జరుగుతుంది. ప్రధానంగా ఇల్లందులో ఓ వ్యక్తి రూ.కోట్లలో గిరిగిరి దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి కనీసం రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఒక్కొక్కరి గిరిగిరి ఫైనాన్స్ ఇస్తున్నట్టు తెలుస్తుంది. ప్రతి రోజు సాయంత్రం దర్జాగా వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇబ్బందుల వల్ల డబ్బులు చెల్లించని పక్షంలో దురుసుగా మాట్లాడడం ఆయన నైజం... ఆర్థిక పరిస్థితుల వల్ల గిరిగిరి ఫైనాన్స్ తీసుకోవడంతో దందా నిర్వాహకుల ఇబ్బందులు బయటకు చెబితే పరువు పోతుందనే భయంతో అష్ట కష్టాలు పడి బ్రతిమిలాడో... దండం పెట్టో డబ్బులను చెల్లిస్తున్నట్లు సమాచారం. మరి కొంతమంది గిరిగిరి ఫైనాన్స్ దందా కొనసాగించే వారైతే మీరు తీసుకున్న గిరిగిరి డబ్బులు చెల్లించని పక్షంలో తనకు అధికారులు తెలుసని భయభ్రాంతులకు గురి చేసి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సైతం కొంత మంది గిరిగిరి ఫైనాన్స్ నిర్వహకులే పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చాక పెట్టిన పెట్టుబడులకు అధిక వడ్డీలు వేసి మరి పంట అమ్మి తీసుకుంటున్నట్టు సమాచారం. దీంతో రైతులకు పైస రాక కష్టం వృధా అయి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తుంది. రైతులు ఆర్థికంగా, మానసికంగా చితికిపోతుంటే గిరిగిరి ఫైనాన్సర్లు మాత్రం రూ. కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపణలు లేకపోలేదు. అనుమతులు లేకుండా గిరిగిరి ఫైనాన్స్ దందా ఎలా కొనసాగిస్తున్నారనేది అర్థం కాని పరిస్థితి. అసలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇల్లందులో గిరిగిరి దందా సైతం కొనసాగుతుందనే చెప్పొచ్చు. గతంలో ఎంతో మంది కరోనా సమయంలో లోన్ యాప్స్ లలో లోన్స్ తీసుకోని తిరిగి కట్టక వారి ఇబ్బందులు, వేధింపులు తాళలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్న విదంగానే గిరిగిరి ఫైనాన్స్ దందా నిర్వాహకుల ఇబ్బందుల వల్ల ఎవరైనా మానసిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటేనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా పేద, మధ్యతరగతి, చిరు వ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకోని గిరిగిరి ఫైనాన్స్ దందా నిర్వహిస్తూ, డబ్బులు చెల్లించే క్రమంలో మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

# అధికంగా పెరిగిన గ్యాస్ ధరలు

- లబోదిబోమంటున్న హోటల్ వ్యాపారస్తులు
- ఒకవైపు గ్యాస్ మరోవైపు పెట్రోల్ డీజిల్ కొరత
- రవాణా సౌకర్యం లేదంటూ నిత్యవసర సరుకులు ధరలు_ కూరగాయల ధరల పెంపు
- త్వరలో ఇంధనం ధరలు కూడా పెరిగే అవకాశం
- ఇక కరువు కష్టాలు మొదలైనట్టేనా?




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 02 (ప్రజా జ్యోతి):** కాలజ్ఞానంలో బ్రహ్మంగారు చెప్పిన విధంగా కరువు కష్టాలు వచ్చాయి అనిపిస్తుంది, అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి కరువు ఏర్పడుతుందని, అదేవిధంగా దొంగతనాలు పెరిగిపోతాయని బ్రహ్మంగారు చెప్పిన విధంగానే అన్ని జరుగుతున్నట్లు అనిపిస్తుంది, ఇందుకు నిదర్శనం గా చూస్తుంటే వేసవికాలం ప్రారంభం నుండి అధిక ఉష్ణోగ్రతతో వేడి మంట మండిస్తుంది, మరోవైపు గ్యాస్ ధరలు పెరగడంతో వంటగదికి వేడెక్కుతుంది, కరోనా సమయంలోనైనా అన్ని దొరికి ఇంట్లోనైనా కూర్చొని తిని బతకగలిగాము కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా ఒకవైపు గ్యాస్ మరోవైపు పెట్రోల్ డీజిల్ నిత్యవసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు ఆకా శాన్ని అంటడంతో సామాన్యుడి బతుకు అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొంది, గత మూడు నెలల నుండి సక్రమంగా గ్యాస్ దొరక్క హోటల్ వ్యాపారస్తులు అల్లాడిపోతున్నారు, గత కొన్ని రోజుల నుండి గ్యాస్ కొరత తో బజ్జీవండి వ్యాపారస్తుడి నుండి రెస్టారెంట్ల వరకు కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసుకొని ఒకరోజు బంద్ చేసి మరొక రోజు బంద్ చేయకుండా తమ తమ వ్యాపారాలను కొనసాగించుకుంటూ వస్తున్నారు, అడపా దడపా ఒకవేళ గ్యాస్ గృహ యజమానుల నుండి అధిక ధరలకు తీసుకొని హోటల్ లను మూసి వేయకుండా కొనసాగిస్తున్నారు, హోటల్స్ ను బంద్ చేస్తే ఇతర రాష్ట్రాల నుండి పాల్వంచకు వలస వచ్చి హోటల్లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వర్కర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడకుండా ఉండేందుకే గ్యాస్ సిలిండర్లను అధిక రేట్లకు తీసుకొని, అదేవిధంగా కట్టెల పొయ్యి పై ఏదో రకంగా హోటళ్లను నడుపుకుంటూ వస్తున్నారు, ఇదిలా ఉండగా 19కేజీల కమర్షియల్ సిలిండర్ గతంలో రూ2,050 ఉండగా గత రెండు నెలల నుండి ఇదే కమర్షియల్ బండ యుద్ధం కారణంగా రూ 2,400కు పెంచారు, ప్రస్తుతం ఈ సిలిండర్ కాస్త మే ఒకటి నుండి ఒక్కసారిగా 1000 రూపాయలు పెరగడంతో ప్రస్తుతం 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధర 3, 400కు చేరుకుంది, ఒక్కసారిగా ఇంత మొత్తంలో గ్యాస్ ధర పెరగడం ఇదే మొదటిసారిగా చెప్పుకోవచ్చు, అదేవిధంగా 5 కేజీల గ్యాస్ సిలిండర్ ధర కూడా పెరగడంతో హోటల్ వ్యాపారులు, ఫుడ్ కు సంబంధించిన వ్యాపారస్తులు లబోదిబో మంటున్నారు, గ్యాస్ దొరక్క కొంతమంది వ్యాపారాలు లు కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తుంటే అందుకు ఫారెస్ట్ అధికారులు కట్టెలు వాడరాదని, హోటల్ ముందల కట్టెలవ్వబడితే జరిమానాలు విధిస్తామని హోటల్ యజమానులను హెచ్చరిస్తుండడంతో హోటల్ యజమానులు ఆందోళనకు గురవుతున్నారు, కమర్షియల్ సిలిండర్లు పాల్వంచకు అన్ని హోటల్స్ కు సుమారుగా 200 సిలిండర్లు కావాలని ఇటీవల హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ను, అదేవిధంగా జిల్లా సివిల్ సప్లై అధికారిని కలవడంతోపాటు రెండు సార్లు గ్రీవెన్స్ డే లో జిల్లా కలెక్టర్కు వినతి పత్రాలు కూడా అందించడం జరిగింది, అయినప్పటికీ పాల్వంచకు కమర్షియల్ సిలిండర్లు సక్రమంగా రాకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఇదిలా ఉండగా ఈనెల 30న జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో సివిల్ సప్లై అధికారులతో పాటు అన్ని గ్యాస్ కంపెనీల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి హోటల్ వ్యాపారస్తులకు కమర్షియల్ సిలిండర్లను సరఫరా చేయాలని ఆదేశించారు, ఇంతలోనే కమర్షియల్ సిలిండర్ ధర ఒకసారిగా వెయ్యి రూపాయలు పెరగడంతో వ్యాపారులు ఏమి చేయాలో తెలియక అయోమయంలో పడే పరిస్థితి నెలకొంది, ఇది ఇలా ఉండగా గ్యాస్ కొరత తో పాటు పెట్రోల్, డీజిల్ కూడా సక్రమంగా దొరకపోవడంతో రవాణా సౌకర్యం లేదంటూ నిత్యవసర సరుకులు ధరలు కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితాలు కంటే రోజురోజుకు అన్ని రకాల వస్తువులు పెరిగిన ధరలను నియంత్రిస్తే చాలు అని అంటున్నారు, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఇక కరువు కష్టాలు ప్రారంభమైనట్లేనా అని సామాన్యులు అనుకోవడం వినిపిస్తుంది, అధికారులు మాత్రం గ్యాస్ కొరత లేదంటూ పెట్రోల్, డీజిల్ గురించి వాహనదారులు ఇబ్బందులు పడరాదని, గ్యాస్ పెట్రోలు, డీజిల్ నిల్వలు అధికంగా ఉన్నాయంటూ చెబుతున్నప్పటికీ అవి మాత్రం బయట అధికారులు చెప్పిన విధంగా కనబడటం లేదనిపిస్తుంది, అధికారులకు తెలియకుండా కొంత మంది బంక్ యజమానులు గ్యాస్ యజమానులు కృత్రిమ కొరతను సృష్టిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి, ఏదేమైనప్పటికీ గ్యాస్, పెట్రోల్ ,డీజిల్ నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించి సామాన్య ప్రజల జీవనస్థితిగతులను దృష్టిలో పెట్టుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సామాన్య ప్రజలను ఆదుకోవాలని పలువురు వాపోతున్నారు.